సాక్షి
పశ్చిమగోదావరి

బుధవారం ၊ 31 ၊ జనవరి ၊ 2024



కలెక్టర్‌ను కలిసిన రాజేంద్రన్

ఏలూరు (మెట్రో): నూజివీడు సబ్ కలెక్టర్‌గా పనిచేసి నెల్లూరు జేసీగా పదోన్నతి పొందిన ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌ను కలిశారు.



రొయ్య సీడ్ సంరక్షణకు చర్యలు

త్వరలో విశాఖ జిల్లాలో రొయ్య సీడ్ సంరక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు అప్సడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం తాడేపల్లిగూడెంలో చెప్పారు. 8లో ▸



తండ్రీ కొడుకుల దుర్మరణం

రావులపాలెంలో ఆగి ఉన్న లారీని మరో లారీ ఢీకొన్న ప్రమాదంలో ఆకివీడుకు చెందిన తండ్రీ కొడుకులు దుర్మరణం పాలయ్యారు. 8లో ▸

న్యూస్‌రీల్

ఎన్ని కుట్రలు చేసినా జగనన్న గెలుపు తథ్యం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి వనిత

ద్వారకాతిరుమల: రాజు బలవంతుడైతే శత్రువులంతా ఒక్కటవుతారు.. అలాగే రాజకీయాల్లో రాజైన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు శత్రువులంతా ఒకటయ్యారని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి తానేటి వనిత ఎద్దేవా చేశారు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమలలోని కాపు కల్యాణ మండపంలో మంగళవారం జరిగిన మండల నాయకులు, కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ జగనన్నను ఎదుర్కొనేందుకు ప్రతి పక్షాలు పీసీసీ చీఫ్ షర్మిలను కూడా రంగంలోకి దింపారన్నారు. ఏ కుటుంబంలో అయినా గొడవలు ఉండటం సహజమేనని, దాన్ని కూడా టీడీపీ రాజకీయం చేయడం సిగ్గుచేటన్నారు. టీడీపీకి కంచుకోట అయిన గోపాలపురం నియోజకవర్గాన్ని కాపాడుకునేందుకు ఆ పార్టీ నేతలు తనపై దుష్ప్రచారం చేస్తున్నారని, ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా తానే విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

దూబచర్ల నుంచి ద్వారకాతిరుమల వరకు శ్రీవారి భక్తులు పాదయాత్రగా వచ్చే బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి తానేటి వనిత శంకుస్థాపన చేశారు. దూబచర్ల వద్ద కొబ్బరికాయ కొట్టి, శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఆలయ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు పెంపు

ద్వారకాతిరుమల: రాష్ట్రంలోని ప్రముఖ దేవాలయాల్లో పనిచేసే సిబ్బంది ఉద్యోగ విరమణ వయస్సు 62 ఏళ్లకు పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం జీవో జారీ చేసింది. వివరాల్లోకి వెళితే.. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది క్రితం ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 62 ఏళ్లకు పెంచుతూ జీవో జారీ చేసింది. అయితే ఆ జీవో దేవదాయశాఖ ఉద్యోగులకు వర్తింపజేయలేదు. దీంతో కొందరు ఉద్యోగులు రాష్ట్ర హైకోర్టును ఆశ్రయించారు. ఇదిలా ఉంటే ఉద్యోగుల విన్నపాన్ని దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేవదాయశాఖ ఉద్యోగుల పదవీ విరమణ వయస్సును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ శాసనసభలో తీర్మానం చేశారు. దీనికి సంబంధించిన జీవో ఎంఎస్ నంబర్ 37 ను రాష్ట్ర దేవదాయశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆర్.కరికల్ వలవెన్ జారీ చేశారు. 2023 జులై 12 నుంచి ఈ ఆదేశాలు అమల్లోకి వస్తాయని జీవోలో స్పష్టంగా పేర్కొన్నారు. దీన్ని బట్టి జీవోలో సూచించిన తేదీ కంటే ముందు 60 ఏళ్ల సర్వీసును పూర్తి చేసి, ప్రస్తుతం కోర్టు ఆదేశాలతో విధులు నిర్వర్తిస్తున్న వారు పదవీ విరమణ చేయాల్సి ఉంటుంది. ఈ జీవో ప్రకారం ద్వారకాతిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో ముగ్గురు ఉద్యోగులు పదవీ విరమణ పొందనున్నారు.

పదింతల సన్నద్ధం

పదో తరగతి ఫలితాల్లో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా జిల్లా విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఉదయం, సాయంత్రం వేళల్లో అదనపు తరగతుల నిర్వహణతో పాటు చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేకశ్రద్ధ చూపుతోంది. ఈ ఏడాది రాష్ట్రంలోనే ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించి, దీన్ని సమర్థవంతంగా అమలు చేసేలా జిల్లా విద్యాశాఖ అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు.

- టెన్త్‌లో నూరుశాతం ఉత్తీర్ణత లక్ష్యంగా కసరత్తు
- అదనపు తరగతుల నిర్వహణ
- సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ
- అధికారుల నిరంతర పర్యవేక్షణ
- పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు 31,341 మంది
- స్టడీ మెటీరియల్ పంపిణీ



తరగతుల నిర్వహణను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

సాక్షి, భీమవరం: పదో తరగతి పరీక్షలు మార్చి 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లా నుంచి 10,775 మంది బాలురు, 10,566 మంది బాలికలతో మొత్తం 21,341 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో నూరుశాతం లక్ష్యంగా ఇప్పటికే జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ నేతృత్వంలో జిల్లా విద్యాశాఖ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఉదయం, సాయంత్రం వేళల్లో పాఠశాలల్లో అదనంగా రెండు గంటల పాటు ప్రత్యేక తరగతులు చేపట్టారు. విద్యార్థుల ఉత్తీర్ణతకు దోహదం చేసేందుకు వీలుగా జిల్లా పరిషత్ సహకారంతో ప్రత్యేకంగా రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఇప్పటికే అందజేశారు.

సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి

గత విద్యాసంవత్సరంలో 20,268 విద్యార్థులు హాజరుకాగా 13,362 మంది ఉత్తీర్ణులు కాగా, 65.93 శాతంగా ఉంది. ఉత్తీర్ణత తక్కువగా ఉండటంపై విశ్లేషించిన విద్యాశాఖ ఉత్తీర్ణులైన వారిలో పదివేల మంది వరకు విద్యార్థులు ఫస్ట్‌క్లాస్ సాధించగా, రెండు వేల మంది వరకు సెకండ్ క్లాస్‌లో ఉత్తీర్ణత సాధించినట్టు గుర్తించింది. ఆరు వేల మంది వరకు సీ, డీ గ్రేడ్ విద్యార్థులే ఫెయిలైనట్టు గుర్తించారు. వారిపై ప్రత్యేక దృష్టిసారించడం ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు చర్యలు చేపట్టారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న వారిలో వెనుకబడిన (సీ గ్రేడ్) విద్యార్థులు 3,304, బాగా వెనుకబడిన (డీ గ్రేడ్) విద్యార్థులు 2,565 కలిపి మొత్తం 5,869 మంది ఉన్నట్టుగా గుర్తించారు.

కలెక్టర్ దిశానిర్దేశం : నూరుశాతం ఉత్తీర్ణత సాధనలో భాగంగా కలెక్టర్ పి.ప్రశాంతి జిల్లా విద్యాశాఖ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ మేరకు డీఈఓ వెంకటరమణ సీ, డీ గ్రేడ్ విద్యార్థుల కోసం యాక్షన్ ప్లాన్ రూపొందించి అమలుచేస్తున్నారు.

స్పష్టమైన ప్రణాళిక



పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణత కోసం స్పష్టమైన ప్రణాళికను అమలు చేస్తున్నాం. ప్రతిరోజు ఉదయం, సాయంత్ర వేళల్లో అదనపు తరగతుల నిర్వహణతో పాటు సీ, డీ గ్రేడ్ విద్యార్థులపై ప్రత్యేకంగా దృష్టిసారించి పరీక్షలకు వారిని సన్నద్ధం చేస్తున్నాం. విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు ఎంతో ప్రతిష్ఠాత్మకంగా పనిచేస్తున్నారు. ఈ ఏడాది లక్ష్యాన్ని చేరుకుంటామని పూర్తి నమ్మకం ఉంది.

– ఆర్.వెంకటరమణ, డీఈఓ, పశ్చిమగోదావరి జిల్లా

యాక్షన్ ప్లాన్

- గణితం, సైన్స్, ఇంగ్లీష్ సబ్జెక్టులలో ప్రత్యేకంగా మెటీరియల్ తయారుచేసి వారితో చదివిస్తున్నారు.
- ఏ రోజు ఏ సబ్జెక్టు చదివించాలనే విషయమై టైం టేబుల్ తయారుచేసి అమలు చేస్తున్నారు. ప్రతి వారం పరీక్షలు నిర్వహించి పురోభివృద్ధిని సమీక్షిస్తున్నారు.
- చేసిన తప్పులు పునరావృతం కాకుండా మరలా ఆయా పాఠ్యాంశాలను రివిజన్ చేయిస్తున్నారు.
- ఒక్కో సబ్జెక్టు టీచర్‌కు ఐదుగురు విద్యార్థుల బాధ్యతలను అప్పగించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడం, వారు ఇంటి వద్ద చదువుతున్నదీ లేనిదీ తల్లిదండ్రులు పర్యవేక్షించే విధంగా సంబంధిత ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు.
- ప్రత్యేక తరగతుల వల్ల విద్యార్థులు అలసటకు గురికాకుండా దాతలు, ఉపాధ్యాయుల సహకారంతో పౌష్టికాహారం అందజేస్తున్నారు.
- సీ, డీ గ్రేడ్ విద్యార్థుల పురోగతిపై డీవైఈఓ, ఎంఈఓ, కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో డీఈఓ వెంకటరమణ ప్రతిరోజు సమీక్షిస్తూ అవసరమైన సూచనలు, సలహాలు అందిస్తున్నారు.
- విద్యాశాఖ అధికారులు ప్రత్యేక తరగతులకు హాజరై వాటి నిర్వహణను పరిశీలిస్తున్నారు.

సీఎం సభకు ఏర్పాట్లు ముమ్మరం



సీఎం సభ వద్ద నిర్మించిన భారీ గ్యాలరీ

దెందులూరు: దెందులూరు సహారా గ్రౌండ్స్‌లో ఫిబ్రవరి 3వ తేదీన నిర్వహించే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొనే 'సిద్ధం' బహిరంగ సభకు దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని ఆధ్వర్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా జరుగుతున్నాయి. కృష్ణా జిల్లా, ఉమ్మడి పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాల నుంచి వచ్చే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల కోసం ప్రత్యేక ఏర్పాట్లను చేస్తున్నారు. సీఎం సభాస్థలికి వెనుక వైపు హెలీప్యాడ్‌ను ఏర్పాటు చేస్తున్నారు. మంగళవారం ఉదయం కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్, డిప్యూటీ కలెక్టర్ భానుశ్రీ, ఏలూరు ఆర్‌డీఓ ఖాజావలీ, దెందులూరు తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ నిర్మాణానికి సంబంధించి పలు సూచనలు చేశారు. హెలీప్యాడ్ వద్ద సీఎం, సీఎం సభాస్థలి వద్ద జేసీబీలతో పనులు వేగవంతంగా జరుగుతున్నాయి.

జేఈఈ మెయిన్స్‌కు 728 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జిల్లాలో జేఈఈ మెయిన్స్–1 పరీక్షలకు మంగళవారం 728 మంది హాజరయ్యారు. ఉదయం జరిగిన పరీక్షకు సిద్ధార్థ క్వెస్ట్‌లో 180, ఏలూరు ఇంజినీరింగ్ కళాశాలలో 100, సీఆర్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో 85, మధ్యాహ్నం పరీక్షలో సిద్ధార్థ క్వెస్ట్‌లో 183, ఏలూరు ఇంజనీరింగ్ కళాశాలలో 97, సీఆర్‌ఆర్‌లో 83 మంది హాజరయ్యారు.

మహాత్ముడి కలను సాకారం చేసిన జగన్



తణుకులో మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి, పార్టీ నాయకులు

తణుకు అర్బన్: మహాత్మాగాంధీ గ్రామ స్వరాజ్యం కలను సచివాలయ వ్యవస్థ ఏర్పాటు ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, అవే గాంధీజీకి ఘన నివాళులని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. గాంధీజీ 76వ వర్ధంతి సందర్భంగా మంగళవారం తణుకు రాష్ట్రపతి రోడ్డులోని గాంధీజీ విగ్రహానికి మంత్రి కారుమూరి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్లేయుల దుర్మార్గాలు, దౌర్జన్యాలను శాంతియుతంగా ఎదుర్కొని స్వాతంత్ర్యం సాధించిపెట్టిన మహనీయుడిని నిత్యం మననం చేసుకోవాలన్నారు. గాంధీజీ స్ఫూర్తితోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేద, బడుగు, బలహీన వర్గాలకు ప్రభుత్వ సేవలన్నీ ఇంటిగుమ్మంలోకే అందిస్తున్నారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, మెహర్ అన్సారీ, నూకల కనకదుర్గ, ఉండవల్లి జానకి, అడ్డా బాబు, ఎం.లలిత, సామంతుల అప్పారావు, తాటిపర్తి వాసు, పిల్లి సూరిబాబు, నున్న దుర్గాప్రసాద్, డి.ప్రకాష్, సాక్షి గోపాలరావు, కుడుపూడి చంద్రరావు, డోలా సింహాద్రి, కంచుమర్తి విశ్వేశ్వరరావు, సలీం, పుల్లెపు సూర్యచంద్రరావు, రేలంగి రాంబాబు, జిలాని పాల్గొన్నారు.

పండగల సర్వీసులతో ఆర్టీసీకి రాబడి

- నాలుగేళ్లలో 4.24 కోట్ల రాబడి
- ఈ ఏడాది సంక్రాంతికి రూ.79 లక్షలపైనే ఆదాయం
- సాధారణ టికెట్ ధరలతో అందుబాటులో ప్రయాణం



భీమవరం (ప్రకాశం చౌక్): పశ్చిమగోదావరి జిల్లా ఆర్టీసీకి పండగలు కలిసివస్తున్నాయి. జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రతి ఏటా సంక్రాంతి, దసరా, కార్తీక మాసం, మహాశివ రాత్రి, తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సులను సాధారణ ధరలకే ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను నడిపి ప్రజలకు బాగా చేరువైంది. ఆర్టీసీకి ప్రత్యేక సర్వీసుల ద్వారా ఏడాదికి రూ.50 లక్షల నుంచి రూ 1.20 కోట్ల వరకు ఆదాయం లభిస్తోంది. సంక్రాంతి, దసరా పండుగల ఆదాయమే ఎక్కువ. ఇందులోనూ సంక్రాంతి సందర్భంగా హైదరాబాద్, విశాఖపట్టణం, విజయవాడలకు ప్రత్యేక బస్సులు నడపడం ద్వారా విజయవాడ జోనల్‌లోనే పశ్చిమ ఆర్టీసీ ఆదాయంలో ప్రథమస్థానంలో నిలుస్తోంది.

నాలుగేళ్లుగా.. 2020 సంవత్సరం నుంచి ఈ ఏడాది సంక్రాంతి వరకు ప్రత్యేక సర్వీసుల ద్వారా పశ్చిమ ఆర్టీసీ రూ.4,33,,86,725 ఆదాయాన్ని ఆర్జించింది. 2022–23 ఏడాదిలో రూ.1.11,37,520, గతేడాది అత్యంత అధికంగా రూ 1.20,65,100 ఆదాయం సాధించి ఈ రెండేళ్లలో రూ.కోటి దాటి ఆదాయం అందుకుని రికార్డు సృష్టించింది. అలాగే గతేడాది అరుణచలం యాత్రకు ప్రత్యేక బస్సులు నడిపి రూ.9.63 లక్షల ఆదాయం పొందింది.

ప్రభుత్వం ప్రోత్సహంతో లాభాల బాట

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ అభివృద్ధిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా చేశారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులు నూతనోత్సాహంతో సంస్థ ఆదాయం పెంపునకు శ్రమించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రయాణికులకు సాధారణ టికెట్ ధరలకే ప్రత్యేక సర్వీసులు చేసి ఆర్టీసీకి ప్రజాదారణ పెంచారు.

చంద్రబాబు పాలనలో నష్టాలే

చంద్రబాబు పాలనలో ఆర్టీసీకి ప్రభుత్వం నుంచి ప్రోత్సాహం కరువైంది. కార్పొరేషన్ సంస్థగానే చూసి ఆర్టీసీ అభివృద్ధికి సక్రమంగా నిధులు కేటాయించలేదు. పోలవరం సోమవారం అంటూ వందలాది బస్సులను పోలవరం టూర్‌కు, తన ప్రచారా సభలకు ఉచితంగా ఉపయోగించుకుని ఆర్టీసీకి బకాయిలు పెట్టారు. దీంతో బాబు పాలనలో ఆర్టీసీ నష్టాలే తప్ప లాభాలు లేవు.

ప్రైవేట్ ట్రావెల్స్ దోపిడీకి చెక్

పండుగ సీజన్లు, తీర్థయాత్రలకు ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు అధిక చార్జీలతో ప్రజలను దోపిడీ చేసేవారు. ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడపడం, సాధారణ చార్జీలు పెట్టడంతో ప్రైవేటు బస్సుల దందాకు చెక్ పెట్టినట్టయింది.

ఆదాయం బాగుంది



ప్రత్యేక సర్వీసులు ద్వారా ఆర్టీసీకి మంచి ఆదాయం వస్తోంది. ప్రతి ఏడాది పండుగలకు, దైవ దర్శనాలకు జిల్లాలోని నాలుగు డిపోల నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నాం. సాధరాణ ధరలకే సర్వీసు చేయడంతో ప్రజలు ఆర్టీసీ ప్రత్యేక బస్సుల ఆదరిస్తున్నారు. గడిచిన నాలుగేళ్ల నుంచి ఇప్పటివరకు రూ.4.33 కోట్ల ఆదాయం సాధించడంలో ఆర్టీసీ ఉన్నతాధికారులు, ఆర్టీసీ ఉద్యోగుల కష్టం ఏంతో ఉంది. ఆర్టీసీ సేవలు జిల్లా ప్రజలకు మరింత దగ్గర చేయడానికి కృషి చేస్తున్నాం.

– ఎ.వీరయ్య చౌదరి, జిల్లా ప్రజా రవాణా అధికారి

అతివల అభ్యున్నతికి ఆసరా

జిల్లా వ్యాప్తంగా వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. డ్వాక్రా మహిళల రుణాలను మాఫీ చేస్తామన్న హామీని అధికారంలోకి వచ్చిన తరువాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసి మహిళల ఆర్థికాభ్యున్నతికి ఆసరాగా నిలిచారు. వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా రుణమాఫీ జరగడంతో డ్వాక్రా మహిళలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమాల్లో భాగంగా మంగళవారం ఆచంట, నూజివీడు నియోజకవర్గాల్లో నాలుగో విడత ఆసరా చెక్కులను అందజేశారు.

– పెనుగొండ/నూజివీడు




తూర్పుపాలెంలో ఆసరా-మనసారా కార్యక్రమానికి అశేషంగా తరలివచ్చిన డ్వాక్రా మహిళలు

సీఎంకు మహిళలు అండగా నిలవాలి

వైఎస్సార్ ఆసరా నాలుగో విడత నిధులను విడుదల చేసి పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసిన సీఎం వైఎస్ జగన్‌కు డ్వాక్రా మహిళలు అండగా నిలవాలి. మహిళల సంక్షేమానికి సీఎం జగన్ అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. – చెరుకువాడ శ్రీరంగనాథరాజు, ఆచంట ఎమ్మెల్యే

(తూర్పుపాలెంలో జరిగిన ఆసరా కార్యక్రమంలో..)



తూర్పుపాలెంలో ఆసరా నాలుగో విడత చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీరంగనాథరాజు, హౌసింగ్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ షర్మిలా రెడ్డి, శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ తమ్మయ్య

పాల వ్యాపారం చేపట్టా



నేను శ్రీసాయి మహిళా సంఘంలో సభ్యురాలిని. మా సంఘానికి ఆసరా పథకం కింద రూ.6 లక్షల రుణమాఫీ జరిగింది. నాకు రుణమాఫీ ద్వారా అందిన రూ.60 వేలు, అలాగే సున్నా వడ్డీ కింద వచ్చిన రూ.20 వేలతో పాల వ్యాపారం చేసుకుంటున్నా. అంతేగాక ఈ నాలుగేళ్లలో అమ్మఒడి, వసతి దీవెన, విద్యాదీవెన పథకాల ద్వారా కూడా లబ్ధి అందింది. నా భర్త రెండు సార్లు జగనన్న తోడు కింద రూ.10 వేల రుణం తీసుకుని ఆకుకూరల వ్యాపారం చేసుకుంటున్నాం. దీంతో మాకు ఆర్థిక ఇబ్బందులు తీరాయి. అన్నివిధాలా మా కుటుంబాన్ని ఆదుకున్న జగనన్నను మళ్లీ సీఎం చేసుకుంటాం.

– కేమిశెట్టి ఉదయశ్రీ, గొడుగువారిగూడెం, నూజివీడు

రూ.4.80 లక్షల రుణమాఫీ



మా గ్రూపునకు రూ.4.80 లక్షల రుణమాఫీ అయింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటను నిలుపుకుంటూ పూర్తి స్థాయిలో రుణమాఫీ చేసి అక్కాచెల్లెళ్లకు అండగా నిలిచారు. గత ప్రభుత్వంలో రుణమాఫీ చేస్తామని చంద్రబాబు మహిళలను మోసం చేశారు. రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. మహిళలను ఆదుకున్న సీఎం వైఎస్ జగన్‌కు అండగా నిలుస్తాం.

– కాళ్ల దుర్గ, కవిటం, పోడూరు మండలం

కులమత వర్గాలకు అతీతంగా పరిపాలన



రాష్ట్రంలో కులమత వర్గాలకు అతీతంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. ఎటువంటి పైరవీలు లేకుండా రుణమాఫీ సొమ్ము నేరుగా మహిళల బ్యాంక్ ఖాతాలకు జమ చేశారు. దీని కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా అందించారు. ఆసరా నాలుగో విడతలో రూ.17 వేలు రుణమాఫీ సొమ్ము అందింది. – చిలుకూరి వరలక్ష్మి, ఆచంట వేమవరం, ఆచంట మండలం

పకడ్బందీగా ఇంటర్ పరీక్షల నిర్వహణ



మాట్లాడుతున్న డీఆర్వో శివన్నారాయణరెడ్డి

భీమవరం: ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని డీఆర్వో బి.శివన్నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇంటర్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై ఇంటర్మీడియట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ జిల్లా కమిటీ సభ్యులు విద్యాశాఖ, పోలీస్, విద్యుత్, వైద్యశాఖ, మున్సిపల్ తదితర శాఖల అధికారులతో నిర్వహించిన మంగళవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు దశల్లో నిర్వహించే ఇంటర్ పరీక్షల్లో ఫిబ్రవరి 2న ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్, 3న ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరుగుతాయన్నారు. పరీక్షలకు జిల్లాలో 111 పరీక్షా కేంద్రాల్లో 17,806 మంది విద్యార్థులు హాజరుకానున్నారని శివన్నారాయణరెడ్డి చెప్పారు. ఫిబ్రవరి 5 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (ఒకేషనల్), ఫిబ్రవరి 11 నుంచి 20వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు (జనరల్) నిర్వహిస్తారన్నారు. ఈ పరీక్షలకు జిల్లాలో 35 పరీక్ష కేంద్రాల్లో 3,106 మంది విద్యార్థులు హాజరవుతారన్నారు. మార్చి 1 నుంచి 20వ తేదీ వరకు జరిగే థియరీ పరీక్షలకు 50 పరీక్ష కేంద్రాల్లో 35,949 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు వివరించారు. అన్ని పరీక్షా కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిరంతరం పర్యవేక్షణ జరపాలని ఆదేశించారు. విద్యార్థులు హాల్ టికెట్‌తో పాటు గుర్తింపు కార్డు తప్పనిసరిగా తీసుకెళ్లాలని సూచించారు. పరీక్షా సమయాలకు అనువుగా ఆర్టీసీ బస్సులను నడపాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఫ్లయింగ్ స్క్వాడ్ టీములను వెంటనే ఏర్పాటు చేయాలని శివన్నారాయణరెడ్డి ఆదేశించారు. రీజనల్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్ బాబు, డిస్ట్రిక్ట్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ కేవీ సత్యనారాయణ, బి.శ్రీనివాసరావు, ఎం.నర్సింహమూర్తి, ఎ.రాజ్ కృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఆర్.వెంకటరమణ, ఆర్టీసీ పీవో గీతాదేవి పాల్గొన్నారు.

సంక్షేమ శకం

ఆరోగ్యశ్రీ తోడుగా నిలిచింది



ఆరోగ్యశ్రీ మాకు తోడుగా నిలిచింది. నా కుమార్తె ప్రసవం కోసం నూజివీడులోని జీఎంహెచ్ఏ హాస్పటల్‌లో జాయిన్ చేశాం. ఆపరేషన్ చేసినప్పుడు మా అమ్మాయికి తక్కువ బరువుతో ఉన్న బిడ్డ పుట్టాడు. దీంతో బిడ్డను 20 రోజులపాటు బాక్సులో ఉంచారు. ఇందుకోసం రూ.1.50 లక్షల వరకు ఖర్చు అయ్యింది. అంతా ఆరోగ్యశ్రీ ద్వారానే చేయడంతో మా దగ్గరి నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకోలేదు. అలాగే రుణమాఫీ పథకం ద్వారా నాకు రూ.62వేలు రుణమాఫీ అయింది. వైఎస్సార్ చేయూతలో రెండు విడతలుగా రూ.37,500 అందాయి. సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– మేదూరి ఝాన్సీరాణి, నూజివీడు

వ్యాపారానికి చేయూత



కిరాణా షాపు పెట్టుకోవడానికి మెప్మా ద్వారా లక్ష రూపాయల రుణం ఇచ్చారు. ఇంటి వద్ద చిల్లర కొట్టు నడుపుకుంటూ నెలకు రూ.3 వేలు బ్యాంకుకు చెల్లిస్తున్నా. అలాగే చేయూత పథకం కింద మూడు విడతలుగా రూ.18,750 చొప్పున ఇచ్చారు. అంతేకాకుండా రుణమాఫీ ద్వారా నాకు రూ.56 వేల రుణమాఫీ జరిగింది. నా భర్త ఆటో నడుపుతుండడంతో వాహనమిత్ర పథకం కింద రూ.10వేలు వస్తున్నాయి. జగనన్ననే మళ్లీ సీఎంగా చేసుకుంటాం.

– బేతే కుమారి, ఎన్టీఆర్ కాలనీ, నూజివీడు

ప్రతి కుటుంబానికీ మేలు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి మేలు చేశారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన ప్రకారం రుణమాఫీ చేసి మహిళలకు అండగా నిలిచారు. అమ్మఒడి, చేయూత, ఆసరా ఇలా ఎన్నో పథకాల ద్వారా పేదలను ఆదుకుంటున్నారు. జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకుంటాం. ఎన్నికల్లో మాట ఇచ్చి మోసం చేసేవారికి తగిన బుద్ధి చెబుతాం.

–కంబాల అనంతలక్ష్మి, పెనుగొండ, పెనుగొండ మండలం

క్లుప్తంగా

హోరాహోరీగా వైఎస్సార్ హెల్త్ వర్సిటీ క్రీడా పోటీలు



ప్రతిభ కనబరచిన జట్టును అభినందిస్తున్న చైర్మన్ ఆకుల విజయవర్ధన్, తదితరులు

పెంటపాడు: ప్రత్తిపాడు ఏఎస్ఆర్ హోమియో వైద్య కళాశాల ప్రాంగణంలో వైఎస్సార్ హెల్త్ వర్సిటీ అంతర కళాశాలల విద్యార్థుల మధ్య జరుగుతున్న క్రీడాపోటీలు మంగళవారం రెండోరోజు కూడా హోరాహోరీగా కొనసాగాయి. ఏఎస్ఆర్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఆకుల విజయవర్ధన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ సురేంద్రకుమార్, ఏఎస్ఆర్ హోమియో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ యూఎస్‌వీ ప్రసాద్‌ల పర్యవేక్షణలో బ్యాడ్మింటన్, త్రోబాల్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, క్రికెట్, అథ్లెటిక్స్, చెస్ పోటీలు జరిగాయి. ఈ పోటీలు తాడేపల్లిగూడెంలోని ప్రత్తిపాడు, పెదతాడేపల్లి వాసవి ఇంజనీరింగ్ కళాశాల, తణుకు ఏఎస్ఆర్ విద్యాలయం వద్ద జరుగుతున్నాయి. టోర్నమెంట్ అబ్జర్వర్ శ్రీనివాసరాజు, ఆశ్రం మెడికల్ కళాశాల శ్రీనివాస్, జీఎస్ఎల్ మెడికల్ కళాశాల నల్లయ్య, సెంట్‌జోసఫ్ కళాశాల ప్రతినిధులతో పాటు, స్థానిక హోమియో కళాశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన ప్రసన్నగంటి మరియన్న

టి.నరసాపురం: నిర్మాణం జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవేపై టి.నరసాపురం సమీపంలో టిప్పర్ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. స్థానిక పెద్ద చెరువు సమీపంలో కూలి పని నిమిత్తం మోటార్‌సైకిల్‌పై పొలానికి వెళుతున్న ప్రసన్నగంటి మరియన్న(45)ను మట్టి తరలిస్తున్న టిప్పర్ మంగళవారం ఢీకొంది. ఈ ప్రమాదంలో మరియన్న అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి భార్య, కుమారుడు ఉన్నారు. కుటుంబానికి జీవనాధారమైన మరియన్న మృతి చెందడంతో నష్టపరిహారం చెల్లించాలని కుటుంబ సభ్యులు డిమాండ్‌చేశారు. దళిత సంఘాల ఆధ్వర్యంలో టి.నరసాపురం ప్రధాన సెంటర్‌లో నష్టపరిహారాన్ని డిమాండ్ చేస్తూ రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ఘటనా స్థలాన్ని జీలుగుమిల్లి సీఐ క్రాంతికుమార్ సందర్శించారు.

పాఠశాల విద్యకు మరింత చేయూత

- ల్యాబ్‌లు, వృత్తి విద్య, క్రీడల్లో నైపుణ్యం పెంపే లక్ష్యం
- జిల్లాలో 24 పాఠశాలలకు పీఎంశ్రీ నిధులు మంజూరు
- తొలి విడతలో రూ.30 లక్షలు విడుదల.. త్వరలో పనులు



పీఎంశ్రీ నిధులకు ఎంపికైన ఎల్బీచర్ల బాలుర గురుకుల పాఠశాల

సాక్షి, భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్ని ఆధునిక పరిశోధన కేంద్రాలుగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా (పీఎంశ్రీ) పథకాన్ని అమలుచేస్తోంది. విద్యార్థుల కోసం పాఠశాలల్లో ల్యాబ్‌లు, వృత్తి విద్య, క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటోంది. ఈ పథకానికి జిల్లా నుంచి 50కు పైగా పాఠశాలలు పోటీపడగా 24 పాఠశాలలు ఎంపికయ్యాయి. వీటిలో 22 ఉన్నత పాఠశాలలు ఉండగా ఒక యూపీ, ఒక ప్రైమరీ పాఠశాల ఉన్నాయి. విద్యార్థుల్లో క్రీడా, సాంకేతిక నైపుణాభివృద్ధి లక్ష్యంగా జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు ప్రభుత్వం రూ.1.83 కోట్లు మంజూరు చేసింది. ఆయా వసతుల కల్పనకు తొలి విడతగా రూ.30 లక్షలు విడుదల చేసింది. వీటితో అవసరమైన పనులు చేపట్టేందుకు సర్వశిక్ష అభియాన్ అధికారులు చర్యలు చేపట్టారు.

క్రీడావసరాలకు రూ.5 లక్షలు

క్రీడా అవసరాల కోసం 18 పాఠశాలలకు రూ. ఐదు లక్షలు చొప్పున నిధులు కేటాయింపులు చేసి తొలివిడతగా రూ.లక్ష చొప్పున విడుదల చేసింది. ఆయా పాఠశాలల్లో క్రీడా ప్రాంగణాల అభివృద్ధి, అవసరమైన కోర్టుల నిర్మాణం, క్రీడా సామగ్రి కొనుగోలు తదితర క్రీడా అవసరాలకు ఈ నిధులు వినియోగించాల్సి ఉంది. అలాగే ఆరు పాఠశాలలకు కెమిస్ట్రీ ల్యాబ్‌ల కోసం అదనపు తరగతి గది నిర్మాణానికి రూ.15.58 లక్షలు చొప్పున మంజూరు చేసింది. పనులు చేపట్టేందుకు తొలివిడతగా రూ. రెండు లక్షలు చొప్పున నిధులు విడుదల చేసింది.

ల్యాబ్‌లకు ఎంపికైన పాఠశాలలు

బాలుర గురుకుల పాఠశాల (ఎల్బీ చర్ల), గురుకుల పాఠశాల, కడకట్ల (తాడేపల్లిగూడెం), బల్లిపాడు, చినకాపవరం, గుట్లపాడు, కలవపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.

క్రీడా అవసరాలకు ఎంపికైన పాఠశాలలు

గురుకుల పాఠశాల (ఆచంట), బీఆర్ఎంవీ మున్సిపల్ ఉన్నత పాఠశాల (పాలకొల్లు), జీహెచ్ఎస్ (పెంటపాడు), జీహెచ్ఎస్ (ఎండగండి), జేఎల్బీ మున్సిపల్ ఉన్నత పాఠశాల (భీమవరం), మున్సిపల్ ప్రాథమిక పాఠశాల (రాయపేట), ఎంపీయూపీఎస్ (వేల్పూరు), వేమవరం, ఆకివీడు, తణుకు, ఇరగవరం, కవిటం, మార్టేరు, మొగళ్లు, మొగల్తూరు, శివదేవుని చిక్కాల, తాడేపల్లిగూడెం, వీరవాసరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఎంపికయ్యాయి.

ప్రభుత్వానికి ప్రతిపాదనలు

ప్రభుత్వ మార్గదర్శకాలు మేరకు ఎంపికైన పాఠశాలలకు అవసరాలు, కల్పించనున్న వసతులకు సంబంధించి ఇప్పటికే సర్వశిక్ష అభియాన్ అధికారులు నివేదికను రూపొందించారు. పాఠశాలల సమగ్ర వివరాలు, క్రీడాస్థలం, తరగతి గదులు, విద్యార్థులు, ఉపాధ్యాయులకు సంబంధించిన వివరాలను ఆన్‌లైన్ ద్వారా ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి తొలి దశ నిధులు విడుదల కాగా ఆయా పనులు చేపట్టేందుకు ఎస్ఎస్ఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాం

జిల్లాలో 24 పాఠశాలలకు పీఎంశ్రీ నిధులు మంజూరయ్యాయి. తొలి దశగా 18 పాఠశాలలకు రూ.లక్ష చొప్పున, ఆరు పాఠశాలలకు రూ.రెండు లక్షల చొప్పున నిధులు విడుదలయ్యాయి. ప్రభుత్వ ఆదేశాలు మేరకు ఆయా పాఠశాలల్లో అవసరమైన పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– పి.శ్యామ్‌సుందర్, ఎస్ఎస్ఏ ఏపీసీ

ఏపీలో బ్రూడ్ స్టాక్ క్వారంటైన్

అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం



అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాంను గజమాలతో సన్మానించిన ఉభయ గోదావరి జిల్లా ఆక్వా రైతులు

తాడేపల్లిగూడెం: ఆక్వా రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో రొయ్య సీడ్ సంరక్షణ నిమిత్తం ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖ జిల్లాలో బ్రూడ్ స్టాక్ క్వారంటైన్ సెంటర్‌ను ఏర్పాటుచేయనున్నట్టు అప్సడా వైస్‌చైర్మన్ వడ్డి రఘురాం తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో తనను కలిసేందుకు వచ్చిన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలోని ఆక్వా రైతులతో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాల హయాంలో ఏనాడు జరగని విధంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఆక్వా రంగం అభివృద్ధి చెందుతుందని అన్నారు. ఆక్వా నిమిత్తం ఇటీవలి కాలంలో 4,600 కనెక్షన్లు ఇచ్చి, అదనంగా 1500 ఎకరాలను ఆక్వా కల్చర్‌లో ప్రభుత్వం కలిపిందన్నారు. ఒకొక్కటిగా ఆక్వా రంగ సమస్యలను ప్రభుత్వం పరిష్కరిస్తూ వస్తుందన్నారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే, వాటిని కూడా చిత్తశుద్ధితో పరిష్కరిస్తామని రఘురాం హామీ ఇచ్చారు. అనంతరం రఘురాంను ఆక్వా రైతు సంఘ నేతలు గజమాలలతో ఘనంగా సత్కరించారు.

ముగిసిన రోప్ స్కిప్పింగ్ పోటీలు



రోప్ స్కిప్పింగ్ పోటీల్లో విజేతలకు మెడల్స్ అందజేస్తున్న డీఈవో వెంకటరమణ

భీమవరం: భీమవరం పట్టణంలోని ఎస్‌సీహెచ్‌బీఆర్ఎమ్ స్కూల్లో మూడు రోజులపాటు నిర్వహించిన 67వ రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్ రోప్ స్కిప్పింగ్ పోటీలు మంగళవారం ముగిశాయి. బాల, బాలికలకు అండర్–14, అండర్–17, అండర్–19 విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు రాష్ట్రవ్యాప్తంగా 13 జిల్లాలకు చెందిన సుమారు 350 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు స్కూల్ గేమ్స్ జిల్లా సెక్రటరీ పీఎస్ఎన్ మల్లేశ్వరరావు చెప్పారు. ఈ పోటీల్లో వ్యక్తిగత, బృంద ఈవెంట్స్‌లోని 36 విభాగాల్లో 216 మంది క్రీడాకారులకు మెడల్స్ అందించామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి ఆర్ వెంకటరమణ, స్కూల్ కరస్పాండెంట్ కె.రామకృష్ణంరాజు, హెచ్ఎం బి శ్రీనివాసరావు, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ జెట్టి షకీల, వ్యాయామ ఉపాధ్యాయులు ఎండీ ఖద్దుస్, ఆర్ రామకృష్ణ, జీపీసీ శేఖర్‌రాజు, బీవీ రామభద్రరాజు, నర్మద, విజయశ్రీ, వాణి, సునీత తదితరులు పాల్గొన్నారు.

గాంధీజీ ఆశయ సాధనకు కృషి

- జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ
- అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష



గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

ఏలూరు (మెట్రో): గాంధీజీ ఆశయ సాధనకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ తెలిపారు. మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ కార్యాలయంలో స్థాయి సంఘం వారీగా జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ మాట్లాడుతూ గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని అమలుపరిచిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. సచివాలయాలు, రైతుభరోసా కేంద్రాలు, వైఎస్సార్ హెల్త్‌క్లినిక్‌లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, మంచినీటి సౌకర్యం, తదితర వసతులతో గ్రామాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. త్వరలో సార్వత్రి ఎన్నికలు రాబోతున్న సందర్భంగా స్థాయి సంఘం సమావేశం చివరిసారిగా నిర్వహించుకుంటున్నామని, అదే విధంగా ఫిబ్రవరి 10వ తేదీన జెడ్పీ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తామని తెలిపారు. సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. జిల్లా పరిషత్ సంఘ సభ్యుల సమావేశానికి జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. ఏ కారణంచేతనైనా రానిపక్షంలో ముందుగానే జెడ్పీ సీఈఓకి సమాచారం అందించాలని అన్నారు. అనంతరం ఈ సమావేశంలో ప్రణాళిక, ఆర్థిక గ్రామీణాభివృద్ధి, విద్యా, వైద్య, మహిళ, సాంఘిక సంక్షేమ స్థాయి సంఘాల సభ్యులు, అధికారులతో ప్రగతి పురోగతిపై సమీక్ష చేశారు. తొలుత జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ కేఎస్ఎస్.సుబ్బారావు, జెడ్పీ డిప్యూటీ సీఈఓ నిర్మలా జ్యోతి, ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వివిధ శాఖల అధికారులు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

విద్యను వ్యాపారం చేయకూడదు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న మోషేన్‌రాజు

భీమవరం: విద్యను వ్యాపారం చేయకుండా సమాజానికి ఉపయోగపడేలా నిర్వహించాలని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. మంగళవారం భీమవరం మండలం చినఅమిరం గ్రామంలోని విశ్వకవి రెసిడెన్సియల్ స్కూల్ 33వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మోషేన్‌రాజు మాట్లాడుతూ భీమవరం ప్రాంతంలో ఎందరో విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దిన ఘనత విశ్వకవి స్కూల్‌కు దక్కుతుందన్నారు. విద్యాసంస్థల డైరెక్టర్ పొట్లూరి రఘుబాబు మాట్లాడుతూ తమ విద్యాసంస్థలో విద్యతోపాటు చక్కని క్రమశిక్షణను నేర్పించడం వల్లనే తమ విద్యార్థులు ప్రపంచవ్యాప్తంగా రాణిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కేఎల్ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ జి.పార్థసారథివర్మ, విశ్వకవి స్కూల్ డైరెక్టర్లు పొట్లూరి స్వరూపరాణి, కృష్ణపార్థు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలను సందర్శించిన ఎస్పీ



బల్లిపాడులో పాఠశాలను సందర్శించిన ఎస్పీ రవిప్రకాష్

అత్తిలి: అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాలను జిల్లా ఎస్పీ యు.రవి ప్రకాష్ మంగళవారం సందర్శించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూ విద్యార్థినులపై లైంగికదాడికి పాల్పడిన నేపథ్యంలో ఎస్పీ స్థానికుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధిత విద్యార్థినులతో మాట్లాడారు. తరగతిగది, వంటగది ప్రాంతాలను ఎస్పీ పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ శరత్‌రాజ్‌కుమార్, తణుకు రూరల్ సీఐ జీవీవీ సత్యనారాయణ, అత్తిలి ఎస్సై వి.రాంబాబు ఉన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కామవరపు కోట: అక్రమంగా నిల్వ ఉంచిన 30 మద్యం సీసాలను పట్టుకుని వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు తడికలపూడి ఎస్సై జయబాబు తెలిపారు. వివరాల ప్రకారం మండలంలోని ఆడమిల్లి గ్రామంలో కాట్రు ధర్మరాజు ఇంటిలో అక్రమంగా మద్యం ఉన్నట్లు ముందస్తు సమాచారం ప్రకారం మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ధర్మరాజు ఇంటి వద్ద ఓల్డ్ టైమర్ కంపెనీకి చెందిన 180 ఎంఎల్ కలిగిన 30 మద్యం సీసాలు స్వాధీన పరుచుకుని, అతనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై చెప్పారు.

రైస్ మిల్లర్ శ్రీరామరాజుకు మాతృవియోగం



విజయలక్ష్మి(ఫైల్)

భీమవరం: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సామంతపూడి శ్రీరామరాజు మాతృమూర్తి సామంతపూడి వెంకట విజయలక్ష్మి(87) మంగళవారం మృతిచెందారు. ఈమెకు ఇరువురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. విజయలక్ష్మి మృతి పట్ల పలువురు ప్రముఖులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

ఆగి ఉన్న లారీని ఢీకొన్న మరో లారీ

- ఇద్దరు మృతి, మరో ఇద్దరికి గాయాలు
- రావులపాలెం హైవేపై దుర్ఘటన



ఆగి ఉన్న లారీని వెనుకనుంచి ఢీకొన్న టిప్పర్ లారీ



లోడు లారీ కింద డ్రైవర్ శ్రీనివాసరావు, క్లీనర్ నాగసత్యసాయి మృతదేహాలు



టిప్పర్ క్యాబిన్‌లో ఇరుక్కుపోయిన డ్రైవర్ జుత్తుగ రవి, క్లీనర్ మణికుమార్

రావులపాలెం: సాంకేతిక లోపంతో రోడ్డుపై ఆగిపోయిన లోడు లారీని అదే మార్గంలో వస్తున్న టిప్పర్ లారీ వెనుక నుంచి బలంగా ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరు గాయాలపాలయ్యారు. సోమవారం అర్ధరాత్రి రావులపాలెం జాతీయ రహదారిపై గౌతమి కొత్త బ్రిడ్జ్ అప్రోచ్ రోడ్డు సమీపంలో ఈ ఘోర ప్రమాదం సంభవించింది. పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడు మండలం మందపాడుకు చెందిన పేపేటి వెంకట శ్రీనివాసరావు (48), అతని కొడుకు నాగసత్యసాయి (26) ఇద్దరు సొంత లారీని తిప్పుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. దీనిలో భాగంగా వారం క్రితం భీమవరం నుంచి చేపల లోడుతో కోల్‌కతాకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో వైజాగ్‌లో తాడు లోడ్ చేసుకుని మందపాడుకు పయనమయ్యారు. రావులపాలెం గౌతమి కొత్త బ్రిడ్జి దాటేసరికి వారి లారీ బ్రేక్ డౌన్ కావడంతో మరమ్మతు చేసుకునేందుకు డ్రైవర్, క్లీనర్ అయిన తండ్రీ కొడుకులు ఇద్దరూ కిందకి దిగి లారీ వెనక టైర్ల వద్ద మరమ్మతులు చేస్తున్నారు. అదే మార్గంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ లారీ వీరి లారీని బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తండ్రీకొడుకులు ఇద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. ఇదిలా ఉండగా టిప్పర్ లారీలో డ్రైవర్, క్లీనర్లుగా ఉన్న జుత్తుగ రవి, ఎల్లె మణికుమార్ బావ, బావమరుదులు. వీరిది ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక. వీరు రావులపాలెంకు చెందిన ట్రాన్స్‌పోర్ట్ కంపెనీలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. రాజమహేంద్రవరం నుంచి గ్రావెల్ వేసుకుని వస్తుండగా బ్రిడ్జి సమీపంలో ఆగి ఉన్న లారీని గుర్తించకపోవడంతో బలంగా ఢీ కొట్టారు. దీంతో రెండు లారీల మధ్య ఇరుక్కుపోయారు. తీవ్ర గాయాలతో రెండు లారీల మధ్య వారు నరకయాతన అనుభవించారు. సమాచారం తెలుసుకున్న పోలీస్, హైవే సిబ్బంది సంఘటన ప్రాంతానికి చేరుకుని రెండు భారీ క్రేన్ల సాయంతో సుమారు రెండు గంటల పాటు తీవ్రంగా శ్రమించి క్షతగాత్రులను బయటకు తీసి రాజమహేంద్రవరం ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి కాకినాడ ఆసుపత్రికి తరలించినట్లు అంబులెన్స్ సిబ్బంది తెలిపారు. అయితే ఈ ప్రమాదంలో క్షతగాత్రులను బయటకు తీసేందుకు డ్రైవర్ రవి తండ్రి శ్రీను చేసిన ప్రయత్నం స్థానికులను కలచివేసింది. ఒకే ప్రమాదంలో ఒక కుటుంబంలోని తండ్రి కొడుకులు మృత్యువాత పడగా, మరో కుటుంబంలోని బావ, బావమరుదులు తీవ్ర గాయాలు పాలవడం ఆ కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కొత్తపేట ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రేమ్ కుమార్ తెలిపారు.

ఇన్సూరెన్స్ కంపెనీకి మొట్టికాయ

- వినియోగదారునికి రూ. 5.22 కోట్ల నష్టపరిహారం
- యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి జాతీయ వినియోగదారుల కమిషన్ ఆదేశం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): వినియోగదారుని క్లెయిమ్‌ను చట్ట విరుద్ధంగా తిరస్కరించిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి జాతీయ వినియోగదారుల కమిషన్ మొట్టికాయ వేసింది. వినియోగదారునికి రూ. 5,22,30,661 చెల్లించాలని సదరు సంస్థకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన వివరాలను నగరానికి చెందిన హైకోర్టు సీనియర్ న్యాయవాది జీ.రోనాల్డ్ రాజు మంగళవారం పత్రికలకు విడుదల చేశారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన కాట్రెడ్డి సురేష్‌కుమార్ హైదరాబాద్‌లోని చైతన్యపురిలో సురేష్ ఫార్మా, గామీ ఫార్మా అనే రెండు ఔషధాల తయారీ సంస్థలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో 2015వ సంవత్సరం జనవరి 26వ తేదీన విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్ని ప్రమాదం సంభవించి సంస్థలోని సరుకు మొత్తం దగ్ధమైంది. దీనిపై ఆ సంస్థల ఇన్సూరెన్స్ కంపెనీ అయిన యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీకి సంస్థ యజమాని సురేష్ నష్టపరిహారం కోసం క్లెయిమ్ చేశారు. అయితే అగ్ని ప్రమాదం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ వల్ల జరగలేదని, మనుషులు పెట్రోల్ ఉత్పత్తులు వాడి అగ్ని ప్రమాదం సృష్టించారని పేర్కొంటూ ఇన్సూరెన్స్ కంపెనీ సదరు క్లెయిములను అక్రమంగా తిరస్కరించింది. దీనితో ఫార్మా సంస్థల యజమాని సురేష్ న్యాయవాది రోనాల్డ్ రాజు ద్వారా జాతీయ వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్‌లో రెండు కేసులు దాఖలు చేశారు. ఈ కేసుల్లో సుదీర్ఘ వాదనల అనంతరం ఈనెల 29వ తేదీన తీర్పు వెలువరించింది. ఈ మేరకు సురేష్ ఫార్మాకు నష్టపరిహారంగా రూ.2,22,36,413లను, భవనానికి జరిగిన నష్టానికి రూ.13,19,996లను 6 శాతంవడ్డీతో సహా 8 వారాల్లో చెల్లించాలని తీర్పు వెలువరించింది. అలాగే గామీ ఫార్మాకు నష్టపరిహారంగా రూ.1,13,96,104.80పైసలకు 6 శాతం వడ్డీతో చెల్లించాలని తీర్పు వెలువరించింది.

పేదలంటే మీకు ఎందుకీ కక్ష ఆరిమిల్లీ!

- పేదలకు ఏ సౌకర్యాలు అందనివ్వరా
- పేద ప్రజలకు ఆస్పత్రి ముఖ్యమా.. దుకాణాలు ముఖ్యమా..
- ఆరిమిల్లిపై విరుచుకుపడ్డ పార్టీ శ్రేణులు



తణుకులో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ ధనరాజు, పార్టీ శ్రేణులు

తణుకు అర్బన్: పేదలకు సంక్షేమం, వసతులు కల్పించడమే లక్ష్యంగా జగనన్న ప్రభుత్వం పనిచేస్తుంటే అందుకు భిన్నంగా తణుకు మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాత్రం నియోజకవర్గంలో పేదలకు ఏ సౌకర్యాలు అందకూడదనే ప్రధాన లక్ష్యంగా పనిచేస్తున్నారని తణుకు ఎంపీపీ రుద్రా ధనరాజు విమర్శించారు. తణుకు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు పేదలకు మంచి చేయాలని పాటు పడుతుంటే పేదలకందే ప్రతి పనికి అడ్డుతగులుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీ టీడీపీ ప్రభుత్వ హయాంలో మీరు చేయలేని అభివృద్ధి, సౌకర్యాలను మంత్రి కారుమూరి చేస్తున్నారనే అక్కసుతోనే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. రూ. 6 కోట్ల నిధులతో వేల్పూరు గ్రామ నడిబొడ్డున 30 పడకల ఆస్పత్రి భవన నిర్మాణానికి శంఖుస్థాపన చేస్తే దానిని నీ అనుయాయుల ద్వారా కోర్టులో పిటిషన్ వేయించి అడ్డుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని తెలిపారు. వేల్పూరు గ్రామ ఇన్‌చార్జ్ నున్న దుర్గాప్రసాద్ మాట్లాడుతూ వేల్పూరులో పేదలు, బడుగు బలహీన వర్గాలకు ఏ వసతులు కల్పిద్దామన్నా మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ అడ్డుకోవడమే పనిగా పెట్టుకున్నారని దుయ్యబట్టారు. ఇప్పటివరకు బీసీ కమ్యూనిటీ హాల్స్ నిర్మాణాలకు సంబంధించి కోర్టుల్లో పిటిషన్‌లు వేయించగా, తాజాగా 12 మంది వైద్యులు సేవలందించే విధంగా 30 పడకలతో రూ. 6 కోట్ల నిధులతో, 2 లక్షలకు పైగా ప్రజానీకానికి పెద్దాసుపత్రిగా తీర్చిదిద్దే భవన నిర్మాణానికి కూడా మీరు అడ్డుకుంటున్నారంటే ఎంతకి దిగజారిపోయారో ప్రజలకు అర్థమవుతుందని అన్నారు. పేదలకు అనారోగ్య సమస్యలకు సద్వినియోగపడే ఆస్పత్రి ముఖ్యమా.. లేదంటే నెలనెలా పంచాయితీకి అద్దెలు సమకూర్చే నాలుగు దుకాణాలు కావాలా అని వేల్పూరు ప్రజలే మిమ్మల్ని నిలదీసే రోజులు దగ్గర పడ్డాయని అన్నారు. ఏది ఏమైనా రానున్న రోజుల్లో అదే స్థలంలో 30 పడకల ఆస్పత్రి నిర్మాణం కోసం ఎంతవరకైనా పోరాటం చేస్తామని, వేల్పూరు గ్రామ ప్రజల అంగీకారంతో నిర్మాణాన్ని పూర్తిచేసి తీరుతామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ తణుకు మండల మహిళాధ్యక్షురాలు చంద్రు శ్యామలాకుమారి మాట్లాడుతూ మంత్రి కారుమూరి పేదల పక్షపాతిగా వ్యవహరిస్తుంటే మాజీ ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ మాత్రం పెత్తందారు పాత్ర పోషిస్తూ పేదలకు అందే సౌకర్యాలను అడ్డుకుంటున్నారని ఎద్దేవా చేశారు. వేల్పూరు గ్రామ పేదలపై ఎందుకింత కక్ష పెంచుకున్నారు ఆరిమిల్లీ అంటూ వేల్పూరు సొసైటీ అధ్యక్షుడు పెనుమర్తి వెంకట్రామన్న, వైస్ ఎంపీపీ ఐశెట్టి శేషకుమారి, ఎంపీటీసీలు గుణ్ణం విజయదుర్గ, తాడిపర్తి సుజాత, నాయకులు కుప్పాల సుబ్రహ్మణ్యం ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, పట్టణ మహిళాధ్యక్షురాలు నూకల కనకదుర్గ, జిలానీ పాల్గొన్నారు.

మినీ జాబ్ మేళాలో 44 మందికి ఉద్యోగాలు



ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో వైస్ ప్రిన్సిపాల్ బ్రహ్మచారి, జేకేసీ ప్రతినిధులు

పెంటపాడు: పెంటపాడు డీఆర్ గోయంకా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం జవహర్ నాలెడ్జ్‌సెంటర్ ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహించారు. ఈ శిబిరంలో జిల్లా నలుమూలల నుంచి 162 మంది నిరుద్యోగులు పాల్గొన్నారు. శ్రీసిటీ, ముత్తూట్ ఫైనాన్స్, అపోలో, యాక్సిస్ బ్యాంక్, అస్ట్రైటెక్, ఫాస్కన్ తదితర కంపెనీ ప్రతినిధులు అభ్యర్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్ని కంపెనీలకు సంబంధించి 44 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పీఎస్ బ్రహ్మచారి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్కిల్ డవలప్‌మెంట్ విభాగాధిపతి మధుభూషణ్ రావు, జెకేసీ ఇన్‌చార్జి ఎం. ఇందిరమ్మ, మెంటర్ సుజాత, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

భక్తాంజనేయ స్వామికి విశేష పూజలు



భక్తాంజనేయస్వామి ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): పుష్య బహుళ చవితి పురస్కరించుకొని పట్టణంలోని రామచంద్రరావు పేటలోని శ్రీకృష్ణ యోగ ధ్యాన మందిరంలో మంగళవారం ఉదయం నిత్యఅర్చనలు, భక్తాంజనేయ స్వామికి సింధూర, నాగవల్లి దళార్చనలు జరిగాయి. సామూహిక శ్రీరామ రక్షా స్తోత్రం హనుమాన్ చాలీసా పారాయణంలు నిర్వహించారు. అభయ గణపతికి పంచామృత అభిషేకాలు, సహస్రనామార్చన, వ్రతా లు జరిగాయి. గణేశ స్తోత్రం, శ్వేతార్క పూజలు జరిగాయి. కార్యక్రమాలను మందిర కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజు పర్యవేక్షించారు.

బీసీ బహిరంగ సభను విజయవంతం చేయండి



బీసీ బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న బీసీ సంఘ నాయకులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): బీసీ హక్కుల సాధనకై రాష్ట్ర వ్యాప్త బీసీ బహిరంగ సభ ఫిబ్రవరి 11వ తేదీన ఆదివారం మధ్యాహ్నం 3 గంటల నుంచి తాడేపల్లిగూడెంలోని నల్లజర్ల రోడ్డులో నిర్వహిస్తున్నట్లు బీసీ చైతన్యవేదిక ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు వీరవల్లి శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం తాడేపల్లిగూడెంలో హలో బీసీ, ఛలో తాడేపల్లిగూడెం బహిరంగ సభ పోస్టర్లును ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ నాయకులు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిటికట్ల త్యాగరాజాచారీ, గౌరెల శ్రీనివాస్, చిటికన ప్రసాద్, చింతకాయల సత్యనారాయణ, మల్లుల విజయ్, ముద్రగడ లలిత కుమారి, పట్నాల శంకరరావు, మండల నాగేశ్వరరావు, అడ్డాల నరసింహారావు, బోగిల్లి రాంబాబు, పి.సుజాత, జి.శ్రీహరి పాల్గొన్నారు.

క్రీడల్లో రాణిస్తే ఉద్యోగావకాశాలు



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

భీమవరం: విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే శారీరక శక్తితో పాటు స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగావకాశాలు పొందవచ్చునని భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజినీరింగ్ కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ అన్నారు. కళాశాలకు చెందిన విద్యార్థి జి.ఈశ్వరరావు ఇటీవల జరిగిన బాడీ బిల్డింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్స్ సాధించిన సందర్భంగా మంగళవారం కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థిని పి.సత్యవేణి ఇంటర్ కాలేజ్ పోటీలు అథ్లెటిక్స్‌లో సిల్వర్ మెడల్స్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. అథ్లెటిక్స్ పోటీల్లో బి.చైతన్యలహరి, ఎం.శ్యామల, కె.నవీన విజయం సాధించగా, మెన్ అథ్లెటిక్స్ పోటీల్లో ఎస్.రవినాయక్ బ్రాంజ్ మెడల్ సాధించడం అభినందనీయమన్నారు.

పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం



ర్యాలీలో పాల్గొన్న చైర్‌పర్సన్ హైమావతి

ఆకివీడు: పరిసరాల పరిశుభ్రతతోనే దేశం ఆరోగ్యంగా ఉంటుందని నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. జాతీయ పరిశుభ్రతా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం స్థానిక నగర పంచాయతీ వద్ద ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ర్యాలీ చేపట్టి ప్రజల్లో అవగాహన పెంచారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణంలోని 18 స్లమ్ సమాఖ్యలు ఆయా ప్రాంతాల పరిశుభ్రతకు కృషి చేయాలన్నారు. మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతిరెడ్డి మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల సభ్యులు తమ ప్రాంతాల్ని పరిశుభ్రంగా ఉంచుతూ ప్రజలు పరిశుభ్రత పాటించేలా కృషి చేయాలన్నారు. కుళాయిల ద్వారా వచ్చే నీటిని కాచుకుని తాగడం వల్ల చాలా రకాల జబ్బులు దూరమవుతాయని చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ జీకే మోహన్, టీఎంసీ మోహన్, అనిల్, ఆర్పీలు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడికి తక్షణమే శిక్ష విధించాలి



బల్లిపాడు పాఠశాలను సందర్శించి మాట్లాడుతున్న జిల్లా ఐద్వా అధ్యక్షురాలు కేతా పద్మజ

అత్తిలి: ఉపాధ్యాయ వృత్తికే తలవంపు తెచ్చే విధంగా ప్రవర్తించిన కీచక ఉపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూకు కోర్టులో జాప్యం లేకుండా వెంటనే శిక్ష విధించాలని జిల్లా ఐద్వా అధ్యక్షురాలు కేతా పద్మజ డిమాండ్ చేశారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు నెం.2 ప్రాథమిక పాఠశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లలకు విద్యాబుద్ధులు, మంచి నడవడిక నేర్పి ప్రయోజకులను చేసే ఉపాధ్యాయ వృత్తిలో ఉండి సభ్యసమాజానికి కళంకం తెచ్చే విధంగా ఉపాధ్యాయుడు శ్రీనివాస నెహ్రూ ప్రవర్తించిన తీరు ఉపాధ్యాయ వృత్తిపై గౌరవం పోతుందన్నారు. తమ పిల్లలను జాగ్రత్తగా చూసుకుంటారు అని ఎంతో నమ్మకంతో బడికి పంపితే అతి కిరాతంగా పిల్లలతో ప్రవర్తించడం దారుణమన్నారు. శ్రీనివాస నెహ్రూను ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. గ్రామంలో మహిళా పోలీసు ప్రతి రోజు పాఠశాలకు వెళ్లి పర్యవేక్షించాలని, తరగతిగదిలో సీసీ కెమేరాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా కమిటీ సభ్యురాలు బంకురు యశోద, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు బత్తుల విజయ్‌కుమార్‌లు బాధిత పిల్లల తల్లిదండ్రులను పరామర్శించారు.

విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటన బాధాకరం



బల్లిపాడులో బాధిత విద్యార్థినులను పరామర్శిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

అత్తిలి: బల్లిపాడు నెం.2 ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులపై లైంగిక దాడికి పాల్పడిన సంఘటనా చాలాబాధాకరమని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పైబోయిన సత్యనారాయణ అన్నారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలను మండల పార్టీనాయకులు సందర్శించి బాధిత విద్యార్థినిలు, తల్లిదండ్రులను పరామర్శించారు. ఈసందర్భంగా పైబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ పాఠశాల హెచ్ఎం శ్రీనివాస నెహ్రూ చిన్నారి విద్యారినులపై అకృత్యాలకు పాల్పడాన్ని మండల పార్టీ తరపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. సంఘటన జరగగానే స్థానిక నాయకులు రాష్ట్రపౌరసరఫరాలశాఖా మంత్రి కారుమూరి నాగేశ్వరరావు దృష్టికి తీసుకురావడంతో ఆయన సకాలంలో స్పందించి బాధితులకు అండగా నిలుస్తూ, నిందితుడిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసు ఉన్నతాధికారులకు సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో అత్తిలి ఏఎంసీ చైర్మన్ బుద్దరాతి భరణీ ప్రసాద్, ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, వైఎస్సార్‌సీపీ పంచాయతీ రాజ్ విభాగం అధ్యక్షుడు ఆకుల పండుస్వామి, ఉపసర్పంచ్ మద్దాల శ్రీనివాస్, జిల్లా సోషల్ మీడియా కో కన్వీనర్ బుడితి సుజన్‌కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలను సీఎం జగన్ నెరవేరుస్తున్నారు



సమావేశంలో మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చీకటిమిల్లి మంగరాజు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కుల, మత, వర్గ బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు చీకటిమిల్లి మంగరాజు పేర్కొన్నారు. పెంటపాడు మండలం ప్రత్తిపాడు సచివాలయం వద్ద మంగళవారం సివిల్ రైట్స్ డే తహసిల్దార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంగరాజు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామాల్లోనూ, పట్టణాల్లోను, ఎస్సీ, ఎస్టీ ఏరియాల్లో సివిల్ రైట్స్ డే రెగ్యులర్‌గా జరుగుతున్నాయన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎస్సీ, ఎస్టీలు అంటే అమితమైన ప్రేమ ఉందని చెప్పారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలను, ఆలోచనలను, రాజ్యాంగాన్ని తూచా, తప్పకుండా పాటిస్తున్న ఏకైక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రత్తిపాడు వైఎస్సార్ సీపీ నాయకులు వీర్ల గోవిందు, ఐసీడీఎస్, సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహాత్ముని ఆశయాలను నెరవేర్చాలి



గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): హాత్ముని ఆశయాలను నెరవేర్చడమే నేటి యువత బాధ్యత అని ఎయిర్ స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు దూలం నాగరాజు అన్నారు. మంగళవారం మహాత్మాగాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యదర్శి చిప్పాడ గురుమూర్తి, కోశాధికారి మల్లారెడ్డి సారధి, కేవీ చలం, కె.నరసింహమూర్తి,ఏఆర్‌కే మూర్తి, మాకా శ్రీనివాసరావు తదితరులు హాజరైయారు. గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక ఓవర్ బ్రిడ్జి సెంటర్లో గాంధీ మండపం వద్ద ఆరాధ్యుల శ్రీరామ్‌చంద్రమూర్తి, దుర్గా రామచంద్రరావు, మల్లుల విజయ్, దాట్ల జగన్నాధరాజు తదితరులు మాట్లాడారు. వాసవి క్లబ్, వనిత క్లబ్ సభ్యులు ఆధ్వర్యంలో ఆర్యవైశ్య కల్యాణ మండపంలో గాంధీ వర్ధంతి కార్యక్రమం జరిగింది. వాసవి క్లబ్ కార్యదర్శి గుప్తా, కోశాధికారి రంగారావు, బాలా త్రిపుర సుందరరావు, బద్రి, సంతోష్, బ్రహ్మాజీ, స్వర్ణకాంతి, నాగలక్ష్మి, కనకదుర, పద్మలత, ఇందిరా, తనుజా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సత్యనారాయణస్వామి కల్యాణం



బలుసులమ్మ ఆలయం వద్ద సత్యనారాయణస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం అర్బన్: పట్టణంలో దేవదాయ ధర్మదాయ శాఖ నిర్వహణలో ధర్మప్రచార మహోత్సవాల్లో భాగంగా మంగళవారం బలుసులమ్మ అమ్మవారి ఆలయ ప్రాంగణంలో అనంతలక్ష్మీ సత్యవతి సమేత శ్రీ సత్యనారాయణస్వామి కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి వైఎస్సార్ సీపీ యువనేత కొట్టు విశాల్ పట్టువస్త్రాలను సమర్పించారు. అన్నవరం దేవస్థానం నుంచి వచ్చిన ఉప ప్రధాన అర్చకులు దివ్య మంత్రోచ్ఛారణలతో కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కర్రి భాస్కరరావు, వెలనాటి సత్తిబాబు, చెన్నాజనార్ధనరావు, అడ్డాల నర్సింహరావు, చింత కాయల సత్యనారాయణ,పెదప్రోలు భాస్కరాచార్యులు పాల్గొన్నారు.

అందరికీ సంపూర్ణ ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం



దర్శిపర్రు ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపీపీ హైమావతి



ఆరోగ్య సురక్షలో ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

పెంటపాడు: ముఖ్యమంత్రి పేదల ఆరోగ్యం కోసం ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్యసురక్ష పేదలకు ఎంతో మేలు జరుగుతుందని ఎంపీపీ దాసరి హైమావతి పేర్కొన్నారు. జగనన్న ఆరోగ్యసురక్ష కార్యక్రమం రెండోవిడతలో భాగంగా మంగళవారం దర్శిపర్రు సచివాలయం, రైతు భరోసా కేంద్రాల వద్ద నిర్వహించిన కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. గ్రామ సొసైటీ అధ్యక్షులు గుండుమోగుల సాంబయ్య, ఎంపీటీసీ సభ్యులు తోట నిరీక్షణరావుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరానికి గ్రామ సర్పంచ్ కోలా శేషవేణి అధ్యక్షత వహించారు. ముదునూరు ప్రాథమిక ఆరోగ్యవైద్యాధికారిణి డాక్టర్ పూజిత, ఏరియా ఆసుపత్రికి చెందిన చిన్నపిల్లల వైద్యనిపుణులు డాక్టర్ కె. సాంబశివరావు, గైనకాలజీ డాక్టర్ ఇవాంజలిన్, కంటి వైద్యనిపుణులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఎంపీహెచ్ఈవో సత్యనారాయణ, మరో 37 మంది వైద్య పారామెడికల్ సిబ్బంది ఈ శిబిరంలో సేవలు అందించారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యకుడు కైగాల శ్రీనివాస్, మండల వ్యవసాయ సలహామండలి అధ్యక్షుడు కట్టుబోయిన కృష్ణప్రసాద్, గుండమోగుల మునీంద్ర, ఉపసర్పంచ్ కోలా మార్కండేయులు, ఎంపీడీవో బాలాజీ, గ్రామ కార్యదర్శి రామారావు, ఐసీడీఎస్ అధికారులు, పెంటపాడు, ముదునూరు ఆరోగ్య సిబ్బంది మెర్సి, రమణ, పీవీ ప్రసన్న, ఆశావర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

శరీరంపై స్పర్శ లేకపోవడం కుష్టువ్యాధి లక్షణం



కుష్టు వ్యాధి నివారణపై ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: శరీరంపై స్పర్శ లేకపోవడం కుష్టు వ్యాధి లక్షణమని, ఇటువంటి లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వాసుపత్రిని సంప్రదించి మందులు వాడటం ద్వారా నివారించవచ్చని మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఏవీ.వెంకటేష్ అన్నారు. కుష్టు వ్యాధి నివారణపక్షోత్సవాల్లో భాగంగా మంగళవారం మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల వద్ద కుష్టు వ్యాధిపై అవగాహన, ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్ మాట్లాడుతూ కుష్టు వ్యాధిగ్రస్తులు క్రమం తప్పకుండా మందులు వాడటం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ టి.సింధు, ఏఎన్ఎంలు కే.వి జయశాంతి, సీహెచ్.విజయనిర్మల, జే.వనుములమ్మ, ఆశా కార్యకర్తలు ఎం.ఆశాలత, ఎంపీహెచ్‌పీ కృపా జాకబ్, ఎంపీహెచ్‌వో వివి.రాజు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

కల్లుగీత వృత్తిని కాపాడుకోవాలి



మహాసభల్లో మాట్లాడుతున్న రాష్ట్ర నాయకులు

తణుకు: కల్లుగీత వృత్తిని కాపాడుకోవాలని కల్లుగీత కార్మిక సంఘం నేతలు పిలుపునిచ్చారు. సంఘ ఏపీ 15వ మహాసభలు తణుకులో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆహ్వానసంఘ అధ్యక్షుడు కామన మునిస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో తెలంగాణా కల్లుగీత కార్మిక సంఘం అధ్యక్షుడు ఎంవీ రమణ, ఏపీ సంఘ మాజీ గౌరవ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దిగుపాటి రాజగోపాల్ తదితరులు మాట్లాడుతూ వృత్తిని గౌరవంగా చూడాలని అప్పట్లో పెద్దలు ఆలోచించేవారని, కానీ నేటి యువకులు వృత్తిని అంగీకరించడం లేదని చెప్పారు. ప్రభుత్వాలు వృత్తికి తగిన రక్షణ, ప్రోత్సాహం కల్పించాలని ఈ సందర్భంగా కోరారు. తొలుత అమరజీవి చిటకన వెంకటేశ్వరరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సంఘ రాష్ట్ర కన్వీనర్ ఎం.భాస్కరయ్య, ప్రధాన కార్యదర్శి జుత్తిగ నరసింహమూర్తి, జిల్లా ఉపాధ్యక్షుడు జి.వీరరాఘవులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



వైఎస్సార్ బీమా అందజేస్తున్న తెన్నేటి జగ్జీవన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక 13వ వార్డు శివాలయం వీధికి చెందిన లారీ డ్రైవర్ పట్నాల వీర్రాజు (48) గుండె పోటుతో మృతి చెందారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తెన్నేటి జగ్జీవన్ వీర్రాజు మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాలు మేరకు వార్డు ఇంచార్జి జగ్జీవన్‌చే వైఎస్సార్ బీమా పథకంలో భాగంగా మట్టి ఖర్చుల నిమిత్తం రూ. 10 వేలు మంగళవారం వీర్రాజు కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ ఎస్.సూర్య, వెల్ఫేర్ సెక్రటరీ రాజ్‌కుమార్, వలంటీర్ మానిక, రోహిణీలు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ పద్మావతి

అత్తిలి: స్త్రీలు ఆర్థిక స్వావలంబన సాధించినప్పుడు వారి కుటుంబం సుఖసంతోషాలతో ఉంటుందని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ దండు పద్మావతి అన్నారు. మంగళవారం అత్తిలి మండలం బల్లిపాడు ఉమర్ ఆలీషా ఆశ్రమశాఖలో ఉచిత కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. ఆకివీడు గ్రామానికి చెందిన డాక్టర్ దండు పద్మావతి గ్రామంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ శిబిరాన్ని ప్రారంభించడం అభినందనీయమని పీఠం సభ్యులు తెలిపారు. ఈసందర్భంగా పద్మావతి మాట్లాడుతూ కుట్టు శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా స్థిరపడాలని ఆకాంక్షించారు. మొదటి బ్యాచ్‌లో 35 మందికి శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కుట్టు శిక్షణ సహాయకులు కట్టాలక్ష్మి, గౌసియాబేగం, పీఠం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బడుగుల అభ్యున్నతికి కృషి

తాడేపల్లిగూడెం (టీఓసీ): కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈతకోట తాతాజీ అన్నారు. వికసిత్ భారత్ సంకల్పయాత్ర పట్టణంలో మంగళవారం 3,4,5 వార్డుల్లో జరిగింది. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నో సంక్షేమ పథకాలను అభివృద్ధి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్ రామగాని సత్యనారాయణ, వన్నేంరెడ్డి నవీన్, అడప రమేష్, డి.శ్రీనివాస్, నారాయణ, తుమరాడ చిన్న, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఎరువులు, పురుగు మందులు

మొగల్తూరు: రైతులకు అవసరమయ్యే ఎరువులు, పురుగు మందులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి అబ్దుల్ రహీమ్ తెలిపారు. మంగళవారం మొగల్తూరులోని నక్కావారిపాలెం, పాలకమ్మ చెరువు తదితర ప్రాంతాల్లో పర్యటించిన ఆయన రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో 1,298 ఎకరాల్లో దాళ్వా సాగు చేపట్టినట్లు అంచనా వేస్తున్నామని, ఇప్పటి వరకు సుమారు 700 ఎకరాల్లో వరి నాట్లు పూర్తయ్యాయని తెలి పారు. మిగిలిన 598 ఎకరాల్లో వరినాట్లు త్వరితగతిన పూర్తి చేయాలని, రాబోయే రోజుల్లో సాగునీటికి ఇబ్బందులు ఉండవని రైతులకు సూచించామని చెప్పారు. రైతులకు అవసరమయ్యే యూరియా 71 టన్నులు, పోటాష్ 2 టన్నులు, సూపర్ 14.5 టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 20 టన్నులు అందుబాటులో ఉన్నాయన్నారు.